# తెలుగు వెన్నెల్లో తేనె మనసులు




నవల

ప్రసూన రవీంద్రన్

# తెలుగు వెన్నెల్లో తేనె మనసులు

ప్రసూన రవీంద్రన్

© Author
© Prasuna Ravindran

This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

**<u>హామీ పత్రం</u>**

కినిగె అక్షర లక్షల నవలలపోటీ 2014 నిర్వాహకులకు నమస్కారములు.

ఈ నవల 'తెలుగు వెన్నెల్లో తేనె మనసులు ' నా స్వంతం. దేనికీ అనుసరణ, అనువాదం, కాపీ కాదు. వేరే ఎక్కడా ప్రచురణకై పంపలేదు. ఎక్కడా పరిశీలనలో లేదని ఇందుమూలముగా హామీ ఇస్తున్నాను.

ఇట్లు,

ప్రసూన రవీంద్రన్.

# తెలుగు వెన్నెల్లో తేనె మనసులు

నిండు పున్నమి...

భావకుల మనోభావాలు విని మరింతగా పొంగిపోవడానికి చంద్రుడు తొందరగా వచ్చేశాడు.

వెన్నెల కూడా పుచ్చ పువ్వులా విచ్చుకుని, వాళ్ళిద్దరి కోసం ఎదురుచూస్తోంది.

వాళ్ళిదర్నీ చూడాలన్న ఆత్రంతో పాటు అసహనమూ పెరుగుతోంది. అది తగ్గించుకోవడానికి మొక్కలూ, పువ్వులతో పాటు రాళ్ళను సైతం పలకరిస్తూ కాలక్షేపం చేస్తోంది వెండి వెన్నెల.

వెన్నెలకే కాదు. అక్కడున్న పూల మొక్కలకీ, ఆ చెట్లలోనే కొలువై ఉన్న తుమ్మెదలకీ కూడా ఆత్రంగానే ఉంది. వాళ్ళిద్దర్నీ చూడాలని. ముచ్చటైన వాళ్ళ సమక్షంలో కాసేపు గడపాలని.

అవును మరి, ఆ పట్టణంలో అంత ముచ్చటగా తేట తెలుగులో మృదు మధురంగా మాట్లాడుకునేవాళ్ళు కనిపించడం లేదు. దశాబ్దాలుగా తను వీక్షిస్తున్న కొన్ని ముచ్చటైన , ముఖ్యమైన కథల గురించి అంత తీరికగా ఇప్పుడు చెప్పుకునేవారు లేరు.

వాళ్ళే స్వామి తాతయ్యా, పది సంవత్సరాల వయసున్న ఆయన మనుమరాలు చందన.

తన సమయమంతా పిల్లలకీ, మనవలకే అంకితం అన్నట్టుండే ఆయన మనసుని ప్రతిబింబించే ఆ వాత్సల్యపూరితమైన చూపులంటే, వీచే గాలికి కూడా మక్కువే మరి.

అది హైదరాబాద్ మియాపూర్లోని విజయా అపార్ట్మెంటుల సమాహారం. అంటే మొత్తం పది అపార్ట్మెంటులు ఒకే ఆవరణలో ఉన్నాయి. అలా ఉంటే గేటెడ్ కమ్యూనిటీ అంటారు. ఆ ఆవరణలోనే కింద ఒక పక్కగా ఉన్న పిల్లల ఆటస్థలంలో ఉన్న సిమెంటు బెంచీ, వెనుకగా ఒక వరుసలో వేసిన పూల మొక్కలు.

ప్రతి రోజు సాయంత్రం తాతా, మనుమరాలూ అక్కడికొస్తారు. మనుమరాలికి ఎన్నెన్నో మంచి విషయాలు చెబుతారు స్వామిగారు. కథలు చెబుతారు. విద్యా, వైజ్ఞానిక విషయాలు చెబుతారు, వార్తలూ, విశేషాలూ చెబుతారు. ఏం చెప్పినా, ఆంగ్ల పదం వాడకుండా చక్కటి తెలుగులో చెప్పే ఆయనంటే మరి తెలుగు నేల మీద పుట్టిన మొక్కలకీ, ఈ తెలుగు నేల మీద వీచే గాలికీ ఇంకా చెప్పాలంటే అక్కడున్న సమస్థ ప్రకృతికీ గౌరవమే మరి.

తాతయ్య పూర్తి పేరు మల్లేస్వర స్వామి. అందరూ 'స్వామి గారూ ' అనే పిలుస్తారు. వాళ్ళది తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి ఒడ్డునే ఉన్న సఖినేటిపల్లె. ఆయన అక్కడొక ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ పొందారు. స్వామి తెలుగు పండితులే కాక, ఇంగ్లీషులోనూ, లెఖ్ఖల్లోనూ కూడా దిట్ట.

కొడుకు వామన మూర్తికి హైదరాబాదులో పెద్ద ఉద్యోగం. అతనికి చందన ఒక్కతే కూతురు. స్వామిగారికి వామన మూర్తి తరువాత ఒక కూతురుంది. పేరు రాధ. ఆమెను సఖినేటిపల్లెలో తన పాఠశాలలోనే పనిచేస్తున్న మురళికే ఇచ్చి వివాహం చేశారాయన. మురళికి ఆ ఊళ్ళోనే కొబ్బరి తోటలు కూడా ఉన్నాయి.

రాధకిద్దరు మగ పిల్లలు. రాం ప్రసాద్, కృష్ణ ప్రసాద్. ఇద్దరూ చందన కంటే అయిదారేళ్ళు పెద్ద.

ముగ్గురు మనుమల మీదా ప్రాణాలే పెట్టుకున్నారు స్వామి గారు. ఉద్యోగ విరమణ చేసినప్పటినుంచీ వారి తోడిదే లోకం ఆయనకు. వామన మూర్తి భార్య వసంతనీ, కూతురు చందననీ, ప్రతి సెలవులకీ సఖినేటిపల్లె పంపిస్తాడు.

రాను రాను తల్లి తండ్రులకి వయసు మీద పడటంతో వామన మూర్తికి వారి ఆరోగ్యం గురించే బెంగ పట్టుకుంది. సఖినేటిపల్లెలో కానీ, ఆ ఊరి చుట్టుపక్కల కానీ, మంచి వైద్య సదుపాయాలు లేవు. ఇక ఆ వయసులో ఆ ఊరిలో ఉండొద్దనీ , తనతో హైదరాబాదు వచ్చెయ్యమనీ, తండ్రి ఉద్యోగ విరమణ అయినప్పటినుంచీ పోరు పెడుతున్నాడు.

స్వామిగారికి తన స్వంత ఊరినీ, కోనసీమలో పచ్చని జీవితాన్నీ వదిలి కాంక్రీట్ అడవిలాంటి పట్టణానికి వెళ్ళడం ఇష్టం లేదు. అంత కంటే ముఖ్యంగా తెలుగు మాటే ఎక్కువగా వినపడని ఆ పట్టణ జీవితం ఆయనకు నచ్చదు. కొడుకు మాట కాదంటూ ఎలాగో పదేళ్ళు గడిపేసాక, ఒకసారి బాగా సుస్తీ చెయ్యడంతో ఇక వామన మూర్తి పట్టుబట్టి తల్లితండ్రుల్ని బలవంతంగా తన ఇంటికి తీసుకొచ్చేసాడు.

అలా స్వామి తాతయ్యా, ఆయన భార్య లక్ష్మీ కొడుకు వామన మూర్తి దగ్గరకొచ్చి నాలుగు నెలలవుతోంది. అప్పటి నుంచీ ప్రతి సాయంత్రం, మనుమరాలు బడి నుంచి వచ్చాక, వారి అపార్ట్మెంటు కిందనే ఉన్న ఆట స్థలానికి రావటం ఆయనకో అందమైన కాలక్షేపం.

మరీ ముఖ్యంగా పౌర్ణమి అంటే స్వామిగారికి, చందనకూ చాలా ఇష్టం. పున్నమి చంద్రుడిని కాసేపు అలా చూస్తూ కూర్చుంటే కళ్ళకీ, తద్వారా మనసుకీ చలువ చేస్తుందని ఆయన చెప్తూ ఉంటారు.

పెద్ద కాన్వెంటులో అయిదవ తరగతి చదువుతోంది చందన. తాతయ్య రోజు సాయంత్రం ఇంట్లో చక్కగా తెలుగు పాఠాలు నేర్పిస్తే శ్రద్ధగా నేర్చుకునేది. సాయంత్రాలు దగ్గర్లో ఉన్న పార్కుకో, గుడికో తీసుకెళ్ళేవారు తాతయ్య. రాత్రి వాళ్ళ బామ్మ అన్నం కలిపి పెడుతూ దేవుడి కథలు చెప్పేది. తాతయ్యా , బామ్మ అంటే చందనకు చాలా ప్రేమ. ముఖ్యంగా పార్కుకి తీసుకెళ్ళినప్పుడో, గుడికి తీసుకెళ్ళినప్పుడో తాతయ్య చెప్పే కబుర్లంటే మరీ ఇష్టం.

తాతయ్య ఎన్నో నీతి కథలు చెప్పేవారు. ఎన్నో విజ్ఞాన పరమైన విషయాలు చెప్పేవారు. ఇంగ్లీషు, లెఖ్ఖలు కూడా చాలా సులభంగా అర్ధమయ్యేలా వివరించి చెప్పేవారు.

ఇంగ్లీషు పదాల ఉచ్చారణ చాలా చక్కగా చెప్పేవారు. తాతయ్య కాలంలో రేడియో తప్ప టీ.వీ లు, ఇంటర్నెట్ లు ఏవీ లేకపోయినా అంత సరిగ్గా తన ఇంగ్లీషు పదాల ఉచ్చారణ సరిచేస్తుంటే చందనకి ఎంతో ఆశ్చర్యంగా ఉండేది. అదే తాతయ్యనడిగితే తాతయ్య నవ్వేసి,

"మా కాలంలో శిక్షణ అంత బాగుండేది, అధ్యాపకులు అంత చక్కగా నేర్పేవారు. వ్యాకరణం కూడా అందరికీ అర్థమయ్యేలా చక్కగా నేర్పేవారు. " గర్వంగా చెప్పారు.

మన దేశానికి స్వతంత్రం రాకముందు జరిగిన విషయాలు, స్వాతంత్ర్య సమర కాలంలో జరిగిన విషయాలే కాకుండా నెహ్రూ నుంచీ వరుసగా ప్రధానులు, రష్ట్రపతుల వివరాలు ఎప్పుడు అడిగినా అనర్గళంగా చెప్పేసే తాతయ్య జ్ఞాపక శక్తికి చందన ఆశ్చర్యపోయేది. పిల్లలేదైనా సందేహం అడిగితే, వెంటనే ఇంటర్నెట్లో చూసి కానీ చెప్పలేకపోతున్న ఈ రాకెట్ యుగపు తల్లితండ్రులు, గురువులకీ, తాతయ్యకాలం నాటి వాళ్ళ మేథస్సుకీ అంత వ్యత్యాసం ఎలాగో ఆ చిన్న మెదడుకి అర్థమయ్యేది కాదు. అందుకే తన సందేహాలన్నీ తాతయ్యనే అడిగేది చందన.

వర్షమంటే తాతయ్యకీ, చందనకి ఎంతో ఇష్టం.

సెలవ రోజెప్పుడైనా జోరుగా వర్షం పడితే చందనకెంతో ఉత్సాహంగా ఉండేది. తాతయ్యతో బాల్కనీలో కూచునేది. ఆ సమయంలో తాతయ్యని విశ్వ కవి రవీంద్రనాథ్ టాగూర్ గురించి చెప్పమనేది. తాతయ్య రవీంద్రనాథ్ టాగూర్ గురించి ఎంతో పొంగిపోతూ చెప్పేవారు. చలం అనువదించిన గీతాంజలిలోని కొన్ని వాక్యాల్ని నెమరేసుకునేవారు. తన దగ్గరున్న మంచి పుస్తకాలు తెచ్చి చందన చేత చదివించేవారు.

వాన పడేటప్పుడు తాతయ్యతో కూచుని అలాంటి మంచి పుస్తకాలు చదవడమంటే చందనకి చాలా ఇష్టం.

ఒకసారి అలాగే తాతయ్య పక్కన కూచుని కథల పుస్తకం చదువుతూ, "పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం, నా స్నేహితుల్లాగా ఇంటర్నెట్లో ఆటలాడటంలో లేదు తాతయ్యా. " అంది.

"పుస్తకాలు చదవడం చాలా మంచి అలవాటమ్మా. దాని వల్ల విజ్ఞానం పెరుగుతుంది. మెదడుకి మంచి వ్యాయామం అవుతుంది. అందులో మంచి విషయాలు

మళ్ళీ మళ్ళీ చదువుకుని తరువాతెప్పుడో మననం చేసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మా కాలంలో టి.వీలు, ఇంటర్నెట్లూ ఉండేవి కాదు కాబట్టి మేమంతా పెద్దవాళ్ళు చెప్పినట్టు విని మంచి మంచి పుస్తకాలు చదువుకునే వాళ్ళం. ఆ కాలంలో పెద్ద పెద్ద గ్రంధాలయాలు ఉండేవి. ఇప్పుడు చదివేవాళ్ళు తక్కువయ్యారు కాబట్టి గ్రంధాలయాలు కనపడ్డం లేదు ఎక్కడా. పిల్లలకి పుస్తకాలు చదివే అలవాటు చేస్తే వాళ్ళలో సృజనాత్మకత పెరుగుతుంది. ఈ కాలం లో కనిపిస్తున్న విపరీత ధోరణులు కొంచం తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది " .

"అవును తాతయ్యా. మీ కాలంలో అన్నీ మంచి అలవాట్లే. మళ్ళీ ఏదైనా విప్లవంలాంటిదొచ్చి మీ కాలం లో లాగా అయిపోతే బావుణ్ణు కదా. " బుగ్గ కింద చెయ్యి పెట్టుకుని తాతయ్య ముఖం లోకి చూస్తూ ముద్దుగా అంది చందన.

అప్పుడే భోజనం చేసి అటు వైపు వచ్చిన వామన మూర్తి ఆ మాటలు విన్నాడు.

"ఈ కాలంలో తాతయ్యా వాళ్ళ కాలంకంటే మనిషికి విజ్ఞానం మరింత చేరువైందమ్మా. ఏ విషయం గురించయినా ఇంటర్నెట్ వల్ల క్షణాల్లో తెలుసుకోవచ్చు. తాతయ్య కాలంలో అలాంటి అవకాశం లేదు. ఆ విషయం మీద ఏ లైబ్రరీకో వెళ్ళి పుస్తకాలు వెతుక్కోవాలి. మనకి కావలసింది చిన్న విషయమైనా, అదెక్కడుందో తెలుసుకోవడానికి మొత్తం పుస్తకం చదవాలి. ఈ రోజుల్లో గూగుల్ లో వేస్తే చాలు, ఎలాంటి విషయమైనా క్షణాల్లో నీ ముందుంటుంది. నీకు చాలా సమయం కలిసి వస్తుంది. "

చందన పక్కనే కూర్చుంటూ అన్నాడు .

చందన వెంటనే తండ్రి మొహంలోకి సూటిగా చూసింది. "నిజమే కానీ, ఏ విషయమైనా మనకి అందుబాటులోనే ఉందిలే అన్న ధైర్యం వల్లనేమో ఇప్పుడెవరూ మరి తాతయ్యా వాళ్ళలా ఏ విషయాన్నీ అంత బాగా గుర్తుపెట్టుకోవట్లేదు కద నాన్నా. మా టీచరైనా , నువ్వూ , అమ్మా అయినా మేమేదైనా సందేహం అడిగితే వెంటనే 'నెట్ లో చూసి

చెబుతా ఉండు ' అంటారు. కానీ తాతయ్య ఏది అడిగినా వెంటనే చెప్తారు నాకు. నా ఫ్రెండ్ దీప్తి వాళ్ళ తాతగారు కూడా అంతే. ఆయనకీ అన్ని విషయాలూ తెలుసు. అది ఏమడిగినా అన్నీ వెంటనే వివరించి చెబుతారు ఆయన కూడా . "

చందన మాటలకి వాళ్ళ నాన్నే కాదు, అక్కడే ఉన్న వసంత, బామ్మా కూడా ముక్కున వేలేసుకున్నారు. ఆ విషయంలో చందన విశ్లేషణ వాళ్ళు కాదనలేకపోయారు. నిజమే మరి. ఏ విషయమైనా నెట్ లో దొరుకుతుందిలే అన్న ధైర్యంతో తాము ఆ విషయాన్ని గురించి పూర్తిగా తెలుసుకోవడానికి సమయం వెచ్చించట్లేదని ఒప్పుకుని తీరాల్సిందే. ఆ విధంగా వెనుకటి తరాల వారికన్నా జ్ఞాపకశక్తిలోనూ, జ్ఞాన జిజ్ఞాసలోనూ వెనకబడి ఉన్నామన్న సంగతి నిజమే. గుర్తుంచుకోవాల్సిన పని లేదు అన్నట్టు , ఏ విషయం గురించీ మనం క్షుణ్ణంగా , శ్రద్ధగా తెలుసుకోవట్లేదు కదా. 'టైము లేదు ' అన్న ముసుగొకటి వేస్తాం అన్నింటికీ.

"ఇంత చిన్న వయసులోనే ఎంత విశ్లేషణా శక్తమ్మా నీకు " తాతయ్య చందన బుగ్గలు పుణికి మురిసిపోయారు.

తాతయ్య అలా మురిసిపోతూ సగం పళ్ళు లేని నోటితో బోసి నవ్వు నవ్వితే చందన కెంతో బావుంటుంది. తాతయ్యవైపు మురిపెంగా చూస్తుంది.

వాళ్ళ ఇంటికి దగ్గరలోనే పెద్ద పేరున్న సంస్థ పెద్ద పెద్ద అపార్ట్మెంట్లు కడుతోంది. అందులో పని చేసేందుకు ఎక్కడెక్కడినుంచో వచ్చిన పనివాళ్ళంతా అక్కడే గుడారాలు వేసుకుని ఉంటారు. ఆ పనివాళ్ళ పిల్లలు కూడా మరీ చిన్నవాళ్ళయితే అక్కడే మట్టిలో ఆడుకుంటూ ఉంటారు. పదేళ్ళ వయసు , ఆ పైన వాళ్ళయితే ఆ కూలీ పనిలోనే వాళ్ళ తల్లితండ్రులకి సహాయం చేస్తూ ఉంటారు.

ఒక్క ఆదివారపు సాయంత్రాలు మాత్రం వాళ్ళలో చాలా మంది ఆ గుడారాల బయటే కూచుని ఉంటారు.

స్వామిగారు ఆ కూలి వాళ్ళ పిల్లలందరినీ అక్కడే ఉన్న పెద్ద చెట్టు కిందకి చేరదీసి, వాళ్ళకి తనే కొని తెచ్చిన పలకా, బలపాలు ఇచ్చి చదువు చెప్పడం మొదలెట్టారు. బడి మొహం ఎరగని ఆ పిల్లలు తాతయ్యని చూడగానే ఉత్సాహంగా దగ్గరకొచ్చేసేవారు. తాతయ్య ఒక గంట సేపు వాళ్ళకి అక్షరాలు, అంకెలు నేర్పించి, మరో అరగంటసేపు మంచి మాటలు, నీతి కథలు చెప్పేవారు.

ఆ పిల్లల తల్లితండ్రుల్లో కొంత మంది సంతోషపడినా, కొందరు చదువు , గిదువూ లేదు వచ్చి పనిలో సాయం చెయ్యండని తిట్టి లాక్కుపోయేవారు. తాతయ్య వాళ్ళకి నచ్చజెప్పాలని చూసారు కానీ , ఆయన మాటని గౌరవించి విన్న వాళ్ళు చాలా తక్కువ మందే.

మొదట్లో చందన 'నేనూ వస్తానని ' మారాం చేసేది.

కానీ, చందన అమ్మ , నాన్నా అభ్యంతరపెట్టారు.

"చందూ, అక్కడ శుభ్రంగా ఉండదు. ఆ పిల్లల దగ్గర కూచుని ఆడావంటే నీకేమైనా అంటువ్యాధులొచ్చే ప్రమాదముంది. మనం వైద్యుల చుట్టూ తిరగాలి. నువ్వు వెళ్ళద్దమ్మా "

"మరి తాతయ్యా అక్కడికి వెడుతున్నారుగా. తాతయ్యకేమీ వ్యాధులు రాలేదుగా "

"బంగారూ, పెద్ద వాళ్ళకి అంత త్వరగా అంటు వ్యాధులు రావమ్మా. నువ్వు చిన్న దానివి కాబట్టి , ఆ మురికిలో ఉండే క్రిముల ద్వారా చాలా సులభంగా వస్తుంది. మా మాట విని నువ్వు ఇక్కడే ఆడుకో"

చందన బుంగ మూతి పెట్టుకుని తన గదిలో ఆడుకోవడానికి వెళిపోయింది.

మరునాడు సాయంత్రం తాతయ్య , చందన వాళ్ళ అపార్ట్మెంటు ఆటస్థలంలో ఉన్న బెంచీల మీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. రోజూ సాయంత్రం వేళ అక్కడ అపార్ట్మెంటులోని పిల్లలందరూ వచ్చి ఆడుకుంటారు. తాతయ్య పక్కనే ఆడుకుంటున్న

అయిదేళ్ళ పిల్లాడు వాళ్ళమ్మని "మమ్మీ " అంటూ పిలవడం తాతయ్య చెవికి సోకింది. తెలుగు భాషని అమితంగా ప్రేమించే తాతయ్యకి పిల్లలెవరైనా తల్లితండ్రులని "మమ్మీ, డాడీ " అని పిలిస్తే చాలా కోపం వస్తుంది. తన మనవలందరికీ కూడా తల్లితండ్రుల్ని " అమ్మా, నాన్నా " అని పిలిచేలాగే అలవాటు చేసారాయన.

రెండు మూడు సార్లు ఆ పిల్లవాడు అలాగే పిలిచేసరికి తాతయ్య "బాబూ, నువ్వు తెలుగబ్బాయివి కదా. చక్కగా మీ అమ్మని 'అమ్మా ' అని పిలు. మమ్మీ అని పిలువకూడదు. " అన్నారు అనునయంగా.

"నో. నేను మమ్మీ అనే పిలుస్తాను. " పొగరుగా మొహం తిప్పుకున్నాడాపిల్లవాడు.

ఇంతలో పక్కనే ఎవరితోనో మాట్లాడుతున్న వాళ్ళ అమ్మ అక్కడికొచ్చింది.

"తల్లి తండ్రుల్ని చక్కగా అమ్మా, నాన్నా అని అచ్చమైన తెలుగులో పిలవడం నేర్పించండమ్మా పిల్లలకి . మమ్మీ , డాడీ అనే పిలుపుల్లో ఎక్కడా మాధుర్యం ఉండదు. " ఏ మాత్రం మొహమాటపడకుండా సూటిగా చెప్పారు తాతయ్య.

ఆ అమ్మాయి కృత్రిమంగా నవ్వేసి కొడుకుని తీసుకుని వెళిపోయిందక్కడినుంచి.

"తాతయ్యా ఈ పట్టణంలో ఎవరికీ తమ విషయంలో తల దూరిస్తే నచ్చదు. ఇక నువ్వు మంచి చెప్పినా ఎందుకు వింటారు? ఆ అమ్మాయి చూడు, నీ వయసుకైనా గౌరవం ఇవ్వకుండా సమాధానమే చెప్పకుండా వెళ్ళిపోయింది. ఇక్కడ చాలా మందికి అలా మమ్మీ, డాడీ అని పిలిపించుకోవడమే ఇష్టం. "

తాతయ్యకి మరింత దగ్గరగా జరుగుతూ అంది చందన.

"మంచి మాట మొహమాటపడకుండా చెప్పడంలో తప్పు లేదమ్మా. ఒకవేళ వాళ్ళు గౌరవించి వినే మనుషులైతే మనమొక విజయం సాధించినట్టే కదా. వినకపోతే మనకి పోయేదేమీ లేదు. కానీ అలా చెప్పకపోవడం వల్ల, మంచి విషయం తెలుసుకుని ఆచరించే గుణమున్న మనిషికి, ఆ అవకాశం ఇవ్వని వాళ్ళమైపోయామన్న అపరాధ భావన నాకుండదు. " నవ్వుతూ అన్నారు తాతయ్య.

తాతయ్య నవ్వుని చందన ముచ్చటగా చూసింది.

మరొక రోజు ఇద్దరు పిల్లలు అక్కడే పచ్చ గడ్డిపైన కూర్చుని ఇంగ్లీషు పిల్లల కథల పుస్తకం చదువుతున్నారు. తాతయ్య వాళ్ళిద్దర్నీ దగ్గరకు పిలిచి " పిల్లలూ, మీరు తెలుగు వాళ్ళేనా " అని అడిగారు .

" ఎస్ అంకుల్ " వెంటనే అన్నాడు వారిలో ఒకడు.

తాతయ్య పకపకా నవ్వుతూ "ఆ విషయం తెలుగులోనే 'అవును ' అని చెప్పొచ్చుగా " అన్నారు.

ఆ పిల్లవాడు సిగ్గుపడుతున్నట్టుగా నవ్వాడు.

"నా పేరు చందన. నేను ప్రగతి స్కూల్లో అయిదవ తరగతి చదువుతున్నాను. మీరిద్దరూ ఏ పాఠశల? ఏ తరగతి చదువుతున్నారు? " చందన తనని తాను పరిచయం చేసుకుంటూ అడిగింది.

ప్రగతి స్కూల్ అంటే చాలా పేరున్న పెద్ద స్కూలే. హైదరాబాదులో చాలా చోట్ల బ్రాంచీలున్నాయి. మరి అలాంటిచోట చదువుతూ పల్లెటూరిపిల్లలా 'అయిదవ తరగతి ' అని చెబుతున్న చందన వంక అదోలా చూశాడు వాడు.

స్వామి గారు ఆంగ్లంలో కూడా మంచి పాండిత్యం ఉన్నా , వాడుకలో ఆంగ్లాన్ని కలిపి తెలుగుని కలుషితం చెయ్యడానికి ఒప్పుకోరు. ఆయన తన పిల్లలకీ, మనుమలకీ కూడా స్వచ్ఛమైన తెలుగులోనే మాట్లాడేలా అలవాటు చేశారు. మారుతున్న సమాజ ధోరణుల్లో పడిపోయి, స్వచ్ఛమైన తెలుగు మాట్లాడేందుకు సిగ్గు పడొద్దని చందనకు ఎప్పుడూ చెప్తూ ఉంటారు.

అందుకే చందన తాతయ్య సూచన పాటిస్తూ ఇంటి వద్ద తెలుగులోనే మాట్లాడుతుంది. స్కూల్ ఆవరణ దాటి బయటికి వచ్చాక కూడా ఆంగ్లంలో మాట్లాడుకునే స్నేహితుల మధ్య తను మాత్రం తెలుగే మాట్లాడటానికి ఎప్పుడూ సిగ్గు పడదు.

"నేను గౌతం . వీడు నా తమ్ముడు రేవంత్. మేము ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్ లో చదువుతున్నాం. నేను ఫిఫ్త్. వీడు ఫోర్త్ " అన్నాడు వాళ్ళిదర్లో పెద్దవాడు.

"మీ ఇద్దరికీ తెలుగు రాయడం, చదవడం బాగా వచ్చా బాబూ ?" అడిగారు తాతయ్య వాళ్ళిద్దర్నీ చూస్తూ.

"కొంచం కొంచం వచ్చు తాతయ్య గారూ. " గౌతం చెప్పగానే రేవంత్ ముందుకొచ్చి "నాకు తెలుగంటే చాలా ఇష్టం తాతగారూ. " అన్నాడు.

ఆ మాత్రానికే తాతయ్య మొహంలో చెప్పలేనంత సంతోషం తొణికిసలాడింది.

"మీకు స్కూల్లో తెలుగు పాఠ్యాంశంగా ఉందా? " అడిగారు తాతయ్య.

"లేదు తాతగారూ. మా బామ్మ, తాతా నేర్పించారు. "

"ఇక్కడే ఉంటారా బాబూ వాళ్ళు? "

"ఊహూ ... విజయవాడ పక్కన పల్లెటూర్లో ఉంటారు. సెలవులకి వాళ్ళ దగ్గరకి వెళ్ళినప్పుడల్లా మాకు తెలుగు నేర్పించేవాళ్ళు. లాస్ట్ ఇయర్ సమ్మర్ నుంచీ మేమక్కడికి వెళ్ళడం తగ్గించేశాం. " రేవంత్ బుంగమూతి పెడుతూ చెప్పాడు.

"ఎందువల్లా ? "

"సమ్మర్లో స్విమ్మింగ్, ఇంకా చాలా ఆక్టివిటీస్లో చేర్పిస్తారు మా మమ్మీ, డాడీ మమ్మల్ని. " ఉత్సాహంగా చెప్పాడు గౌతం.

తాతయ్య నిట్టూర్చి "రేవంత్, మరి నీకు తెలుగంటే ఇష్టం అన్నావ్ కదా. మరి మీ అమ్మా, నాన్నని మీరు మమ్మీ, డాడీ అని పిలుస్తారా? " అని అడిగారు.

రేవంత్ తాతయ్య పక్కనే వచ్చి కూచుని "నాకు అమ్మా, నాన్నా అని పిలవడమే ఇష్టం తాతయ్యగారూ. మా బామ్మ, తాతయ్యా, అమ్మమ్మా వాళ్ళందరూ కూడా మమ్మీ, డాడీ అనే పిలుపు వింటే తిడతారు. కానీ మా అమ్మ ఊరుకోదు. మమ్మీ, డాడీ అనమంటుంది. " అన్నాడు.

తాతయ్యా, చందన ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Telugu+Vennello+Tene+Manasulu](http://kinige.com/book/Telugu+Vennello+Tene+Manasulu)**

* * *